# ఆశల దీపం

అది బోస్టల్ స్కూలు.

పసి వయసులో పౌరుషోద్రేకాలకు లోనై అనూహ్యమైన నేరాలు చేసిన బాల నేరస్తుల కందులో శిక్షణ ఇస్తారు. వారిలో పాత ప్రవృత్తి పునరావృతం కాకుండా పర్యవేక్షిస్తూ విద్యాబోధన ద్వారా మానసిక పరివర్తన తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతుందక్కడ. ఒక రకంగా వాళ్ళ కది పవిత్ర దేవాలయం.

ఎప్పటిలాగే అధికారుల అనుమతి కోసం అక్కడ కొచ్చి నిలబడింది అన్నపూర్ణ. ఆమెకు ముప్పై అయిదేళ్లుంటాయి. బొట్టు లేని ఆమె మోము జాబిలి లేని ఆకాశంలా వెల వెల బోతోంది. దీనత్వం ఉట్టిపడే ఆమె కళ్లల్లో వెయ్యేళ్ళ అనుభవం ఉంది.

ఆమెను చూసిన జైలర్ జగన్నాధం మనస్సు కలుక్కుమంది. ప్రతి నెలా క్రమం తప్పకుండా తనయుణ్ణి చూసుకోడానికి వస్తుందామె.అనుక్షణం ద్వేషాన్ని పంచుకుంటూ ఏవగించుకుంటున్న ప్రదీప్ కోసం రావడం, నిరాదరణకు గురై వ్యధిత హృదయంతో తిరుగుముఖం పట్టడం గత పది మాసాలుగా జరుగుతోంది.

“నీ నీడను చూస్తేనే అసహ్యించుకుంటున్న ప్రబుద్ధుడి కోసం ఎందుకమ్మా అంత ఆరాటం” అడుగుతోందతడి అంతరాత్మ.

‘నన్ను వాడెంత కాదనుకున్నా వాడు నాపేగు. వాడిని చూడందే ఉండలేనయ్యా’ అంటున్నాయి ఆమె నయనాలు.

కొన్ని క్షణాలు ఇరువురి నడుమ నిశ్శబ్దం.

“మా అమ్మను చూడడం నా కెంత మాత్రం ఇష్టం లేదు. ఇంకెప్పుడూ నన్ను

పిలవకండి అంటూ ఖండితంగా చెప్పాడు నీ సుపుత్రుడు. నువ్విక పైన...."

జైలరు మాటలకు చివుక్కుమన్న దామె హృదయం. "అలా అనకండి బాబూ! జీవితంలో అన్నీ పోగొట్టుకున్న ఈ అభాగ్యురాలు ఇంకా బ్రతికి ఉందంటే వాడి కోసమే నాయనా! నేను వచ్చానని తెలిస్తే రాడని అంటున్నారు. పోనీ మరోమిషతోనైనా కబురు చేయండి. ఒక్కసారి తనివితీరా నా బిడ్డను చూసుకుని వెళ్ళిపోతాను." పొంగుకొస్తున్న దుఃఖాన్ని దిగమ్రింగుకుంటూ అన్నదామె. ఆమె కళ్లు వర్షించడానికి సిద్ధంగా ఉన్న మేఘాల్లో దట్టంగా నీటి పొరలతో నిండిఉన్నాయి.

కానిస్టేబుల్ని పిలిచి కబురు చేశాడు జగన్నాధం.

అతడు పనిచేసేది పోలీసు డిపార్టుమెంటైనా వెన్నలాంటి మనసతడిది. తల్లీ తనయుల అనుబంధం అతడికి బాగా తెలుసు. తను ఏభయ్యవ వసంతంలో అడుగుపెట్టినా, అవసానదశకు చేరుకున్న అమ్మను అత్యంత అపురూపంగా చూసుకుంటున్నాడు.

అల్లంత దూరంలోనే అన్నపూర్ణను చూసి వెనుదిరిగాడు ప్రదీప్.

అతడి కళ్ళల్లో తల్లి పట్ల గల అనాసక్తి ఏహ్యాభావం స్పష్టంగా గోచరిస్తున్నాయి.

వెయ్యి ముక్కలైంది అన్నపూర్ణ హృదయం అంతవరకు వర్షించడానికి సిద్ధంగా ఉన్న కన్నీరు జలపాతంలా జలజలా చెంపల మీదకు జారింది. మూగబోయిన కంఠం పలికేందుకు ప్రయత్నించింది. గొంతు విడి మాట బయటకు రావడం లేదు. గాయపడిన గుండెను చేత్తో అదిమిపట్టి తిరుగు ముఖం పట్టింది.

ఆ తల్లి కడుపుకోతను అర్థం చేసుకున్నాడు జగన్నాధం. మౌనంగా రోదించసాగిందతడి హృదయం.

జ్ఞాపకాల పొరల్లోకి అడుగులు వేస్తూ ముందుకు సాగింది అన్నపూర్ణ. గతంలోని సంఘటనలు కళ్ళ ముందు నర్తించసాగాయి.

❁ ❁ ❁

ఇద్దరాడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసి అప్పులపాలైన అన్నమయ్య మూడో కూతురు అన్నపూర్ణకు పెద్దింటి సంబంధం తీసుకురాలేకపోయాడు. పెద్దమ్మాయికి డాక్టర్ని రెండో దానికి ఇంజనీర్ని చేశాడు. కడదానికి మాత్రం క్లాస్ ఫోర్ ఉద్యోగిని తీసుకురావడం గగనమైపోయింది.

తల్లిదండ్రుల ఆర్థిక స్థితిగతులను అవగాహన చేసుకున్న అన్నపూర్ణ పుణ్యాం కొద్దీ పురుషుడని సరిపెట్టుకుంది. సుఖమయ దాంపత్య జీవితానికి డబ్బు కొలబద్ద

కాదని తలచింది. అందుకే తండ్రి తెచ్చిన సంబంధానికి 'ఊ' కొట్టింది.

ఎలక్ట్రిసిటీ బోర్డులో నాలుగవ తరగతి ఉద్యోగిగా పనిచేసే నారాయణ కట్టుకున్న భార్యకు ఏ లోటు చేయకూడదనుకున్నాడు. జీతంతో పాటు మరో నాలుగు రూపాయలు ఆర్జించాలన్న తపనతో సెలవు దినాలలో అక్కడా ఇక్కడా ఏదో ఒక పని చేసేవాడు.

డబ్బుకోసం భర్త పడే అవస్థను గమనించి "మీరు తెచ్చే పైసా కంటే మీరు పంచి ఇచ్చే ప్రేమే నాకు అంతులేని ఆనందాన్ని ఇస్తుందండీ. అనవసరంగా విరామ సమయాల్లో కూడా కష్టపడుతూ ఆరోగ్యం పాడుచేసుకోవద్దు." సలహా ఇచ్చింది అన్నపూర్ణ.

"పిచ్చిదానా! ఈ లోకంలో సుఖంగా బ్రతకాలన్నా బంధువర్గంలో గౌరవం నిలదొక్కుకోవాలన్నా డబ్బే ముఖ్యం. ఒంట్లో కాస్త బిగువున్నప్పుడే పది రాళ్ళు సంపాదించుకోవాలి." తన అభిప్రాయాన్ని బయటపెట్టాడు నారాయణ.

నవ్వి ఊరుకుంది అన్నపూర్ణ.

వారి జీవితం ఆనందానికి మారుపేరైంది. వారి జీవన కలశం అనురాగామృతంతో నిండి తొణికిసలాడింది. ఏడాది తిరక్కుండానే పండంటి మగబిడ్డను కన్నది అన్నపూర్ణ. దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఆ బిడ్డకు ప్రదీప్ అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచుకోసాగారా దంపతులు.

కాలం ఎల్లప్పుడూ ఒకే రీతిగా సాగిపోతే దాని కంటూ ఒక ప్రత్యేకత ఏముంటుంది? అందుకే ఈ పుడమి మీద జీవించే కోట్లాది మంది జీవితాలతో రకరకాలుగా ఆడుకుంటూ ఉంటుంది. అనుక్షణం సుఖభోగాలలో తేలియాడే వారికి అప్పుడప్పుడూ కష్టం అంటే ఏమిటో గుర్తు చేస్తూ ఉంటుంది. గాయపడిన వారి గాయాల్ని మాయం చేసి వారి జీవితాలలో వసంతం నింపుతుంది. నారాయణ కరెంటు పోలెక్కి పనిచేస్తూ విద్యుద్ఘాతానికి బలైపోయాడు.

పసి వయసులో అయిదోతనాన్ని పోగొట్టుకున్న అన్నపూర్ణను ఆదుకోవడం కోసం యూనియన్లు ఆమెకు కాంపెన్సేషన్ చెల్లించాలని పట్టుబట్టాయి. డబ్బు కోసం కక్కుర్తిపడి డ్యూటీలో లేనప్పుడు పోలెక్కి మరణించాడని, అందువల్ల నారాయణకు ఏ విధమైన నష్ట పరిహారం ఇవ్వవలసిన అవసరం లేదని బోర్డు ప్రకటించింది. నారాయణ ఉద్యోగం పర్మనెంట్ కానందున అన్నపూర్ణకు పెన్షన్ లాంటి సదుపాయాలేవీ సమకూరలేదు.

భర్త కాలం చేయడంతో ఆమె జీవితం రోడ్డున పడింది. నామ మాత్రంగా చదువుకున్న తను ఈ ప్రపంచంలో ఎలా బ్రతకాలో బోధపడలేదు. మన సమాజంలో ప్రతి స్త్రీ చదువుకుని తీరాలని ఎందుకంటున్నారో, విపత్కర పరిస్థితులలో విద్య ఆమె నెలా ఆదుకుంటుందో ఆలస్యంగా అర్థం చేసుకుంది అన్నపూర్ణ.

కూతురి కష్టాన్ని చూడలేక కన్ను మూశాడు అన్నమయ్య.

కూటి కోసం పదిళ్ళలో పాచిపని చేయడానికి సిద్ధపడింది అన్నపూర్ణ. బిడ్డలో భర్త ప్రతిబింబాన్ని చూసుకుంటూ వాడి భవిష్యత్తును తీర్చి దిద్దేందుకు తనెంతైనా శ్రమ పడాలనుకుంది.

అనుకున్న వన్నీ సజావుగా జరిగిపోతున్నంత కాలం మనిషి తానే దైవాంశ సంభూతడనని విర్రవీగుతాడు. భగవంతుడిని మరిచిపోతాడు. అందుకే మానవులు చేసే ప్రయత్నాలలో కొన్నింటికి విఘాతం కలిగించి "నేనూ అనే వాణ్ణి ఒకడి నున్నాను సుమా!' అంటూ భగవంతుడు మనకు అనుక్షణం గుర్తు చేస్తూ ఉంటాడు.

బిడ్డ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న అన్నపూర్ణకి చివరికి నిరాశ మిగిలింది. చదువుకుని ప్రయోజకుడు కావాలన్న తలంపుతో ముచ్చటగా ముస్తాబు చేసి, పుస్తకాలిచ్చి బడికి పంపితే, ప్రదీప్ తుంటరి మూకతో తిరుగుతూ సిగెరెట్లు కాల్చడం, గోళీకాయ లాడటం మొదలుపెట్టాడు. డబ్బు కోసం చిన్న చిన్న దొంగతనాలు ప్రారంభించాడు.

రోజూ బడికి హాజరు కావడంలేదన్న పంతుళ్ళ ఫిర్యాదు నందుకుని స్కూలుకు వెళితే కొడుకు బండారం బయటపడింది.

బిడ్డలో ఊహించని పరిణామాన్ని చూసి విలవిల లాడిపోయింది అన్నపూర్ణ.

తండ్రి లేని బిడ్డన్న మమకారంతో ప్రదీప్‌ని పల్లెత్తు ముక్క అనలేకపోయింది. సాధ్యమైనంతవరకు బిడ్డను లాలించి బుద్ధి చెప్పాలనుకుంది. బాగా చదువుకోమని బ్రతిమలాడింది. ఆమె సూక్తులు అతడిలో ఆవగింజంతైనా పరివర్తన తీసుకురాలేక పోయాయి.

వీధి బడి మానిపించేసి మంచి క్రమశిక్షణ గల కాన్వెంటులో చేర్పించాలనుకుంది. అయితే అందుకు తన ఆర్థిక పరిస్థితి అనుమతించలేదు. బిడ్డ ఎన్ని తప్పులు చేసినా లాలించి ప్రేమించడం తప్ప దండించలేదు తల్లి. కొడుకు మీద ఎంత మమకారం ఉన్నా, దానిని మనసులోనే బందించి అతడి శ్రేయస్సు దృష్ట్యా అవసరం అనుకుంటే

గట్టిగా శిక్షించగలుగుతాడు తండ్రి. మాతృమూర్తి ప్రేమ, పితృదేవుని మందలింపులతో బిడ్డలు పెరిగి వృద్ధిలోకి వస్తారు ఇది లోక రీతి.

ప్రదీప్‌కి తల్లి తప్ప తండ్రి లేడు. తండ్రి తరువాత గురువే ఆ బాధ్యత స్వీకరిస్తాడు. అందుకే ప్రదీప్ చదువుకుంటున్న స్కూలుకెళ్ళి ఉపాధ్యాయులందర్నీ సంప్రదించింది.

లాలయేత్పంచ వర్షాణీ
ద్దేశ వర్షాణీ తాడయేత్
ప్రాప్తేతు షోడశౌ వర్షే
పుత్రం మిత్ర వదాచరేత్

"ఐదు సంవత్సరాల వరకు బిడ్డను లాలించి పెంచాలి. పది సంవత్సరాల నుండి పదహారేళ్ళ వరకు దండించాలి. ఆ పైన మంచి స్నేహితునిగా చూడాలి. అని శాస్త్రంలో ఉంది. అందుచేత వాడిని కాస్త దండించి చూడు దారిలో పడొచ్చు" అంటూ సలహా ఇచ్చారు తెలుగు పండితులు.

మరుక్షణం అతని సలహాని ఆచరణలో పెట్టింది అన్నపూర్ణ. చేతులు నొప్పి పుట్టేలా బిడ్డను కొట్టింది.

తల్లి మనసు నెరిగిన ప్రదీప్ సొమ్మసిల్లిపోయినట్లుగా నటించాడు. బిడ్డను చూసి విలవిల లాడిపోయింది. వెంటనే అక్కున జేర్చుకుని ఏడుస్తూ మరెప్పుడూ చేయి చేసుకోనని భర్త మీద ఒట్టేసుకుంది.

రోజులు దొర్లుతున్నాయి. రాను రాను ప్రదీప్ ఇంటిపట్టున ఉండటమే మానేశాడు. ఆకలైతే ఇంటి కొస్తాడు. లేకుంటే లేదు.

కళ్ళెదుటే కొడుకు పాడై పోతున్నా పెదవి విప్పలేకపోతోంది అన్నపూర్ణ.

ఇలా ఉండగా ఓ మారు ఆ ఊరికి బాబాగా రొచ్చారు.

తమ కష్ట సుఖాల్ని బాబాగారితో చెప్పుకోడానికి జనం ఎగబడ్డారు.

అన్నపూర్ణ కూడా కొడుకుని బాబాగారి వద్దకు తీసుకెళ్ళింది. వాడి బుద్ధి మారేలా చేయమని వేడుకుంది. ఆమె అంతరాంతరాల్లో ఇంకా ఏదో ఆశ.

"అంతా లలాట లిఖితం. బ్రహ్మ రాతకు మనం కర్తలం కాలేము తల్లీ!" బాబాగారి వేదాంత ధోరణికి చిర్రెక్కిన అన్నపూర్ణ చర్రున కొడుకు చెయ్యి పుచ్చుకుని బయటికొచ్చేసింది.

అక్కడ నుంచి సరాసరి హెడ్ కానిస్టేబుల్ కాంతయ్య ఇంట్లో పాచి పని

చేయడాని కెళ్ళింది అన్నపూర్ణ.

బోస్టల్‌స్కూల్లోపిల్లల అల్లరిని తానెలా అదుపు చేసింది భార్యతో చెబుతున్నాడు కాంతయ్య.

ఇల్లు ఊడుస్తూ కానిస్టేబులు చెప్పిందంతా శ్రద్ధగా విన్నది అన్నపూర్ణ.

"ఏవే పూర్ణా! నిన్న పనిలోకి రాలేదేం?" అడిగింది కమల.

"ఏం చెప్పేదమ్మా, రాజుగారి తోటలో మామిడికాయలు కోసినందుకు నా బిడ్డను చితకబాదాడు ఆ తోటమాలి. పసివాడు అనైనా లేకుండా ఎం తెంత దెబ్బలేశాడు? వాడిని విడిపించుకుని ఇంటి కొచ్చేసరికి వేళ మించిపోయింది. రాత్రంతా ఒకటే జ్వరం ప్రొద్దున్న కాస్తనిమ్మళంగా ఉంటే ఇలా బయలుదేరి వచ్చాను. ఏమిటో ఉన్న ఒక్క నలుసు అలా తయారయ్యాడు. రాత్రింబవళ్ళు వాడి గురించే నమ్మా నా బెంగంతా" అంటూ కంటతడి పెట్టింది అన్నపూర్ణ.

"ఊరుకో ఏడవకు. పిల్లలు పెద్దవారై మనల్ని ఉద్ధరిస్తారనుకుంటాం ఇలా బాధ పెట్టకుండా ఉంటే చాలనిపిస్తుంది ఒక్కోమారు."

"అమ్మా!" కమలమ్మ కళ్ళలోకి జాలిగా చూసింది అన్నపూర్ణ. ఆమె కంఠంలో ఆర్ద్రత ఇమిడి ఉంది.

"ఏవిటే"

"మరేం లేదమ్మా! మీరు నాకు చిన్న ఉపకారం చేసి పెట్టాలి."

"చెప్పు".

"మీరు, అయ్యగారు మాట్లాడుకుంటుందంతా విన్నాను. ఆదేదో బడిలో పిల్లల్ని బాగా దండించి మంచి క్రమశిక్షణలో పెడతారంట కదా!"

"ఆ స్కూళ్ళు మనలాంటి వాళ్ళ కోసం కాదే. బాలనేరస్తులకి. అంటే చిన్నతనంలో ఉద్రేకాలకు లోనై నేరాలు చేస్తే వారికి శిక్షగా ప్రభుత్వం ఆ స్కూళ్ళలో జాయిన్ చేస్తుంది. వాటి సంగతి నీ కెందుకులే. తొందరగా గిన్నెలు తోము. వంట చేసి కేరేజు కట్టాలి" అంది కమల ఆమె మాట పూర్తి కాకుండానే.

మరి మాట్లాడలేదు అన్నపూర్ణ.

ఒక రోజు కాంతయ్య, కమలమ్మ మొదటి ఆట సినిమా కెళుతూ అన్నపూర్ణకు ఇల్లు అప్పగించారు. వారి మాట కాదనలేక వాళ్ళు వచ్చేంతవరకు అక్కడే ఉండి వారితో పాటు నాలుగు మెతుకులు కతిగి ఇంటి ముఖం పట్టింది.

రాత్రి పదిన్నరవుతోంది. ఆ రోజుఅమావాశ్య అవడం వల్ల చిమ్మచీకటిగా

ఉంది. ఊళ్ళో పవర్ కట్ ఉండడంవల్ల ఎలక్ట్రిక్ దీపాలు వెలగడంలేదు. భయంతో ప్రాణాలుగ్గబట్టి వడివడిగా నడుస్తోంది అన్నపూర్ణ.

అప్పుడే తప్పత్రాగి ఆ దారంట వస్తున్న నరసింహులు కళ్ళల్లో పడింది. ఆమె మీద ఎప్పటినుండో అతడికి కోరిక ఉంది. ఇలా చీకట్లో ఒంటరిగా తటస్థపడడంతో ఆకలిగొన్న పులిలా ఆమెపైకి ఉరికాడు.

కెవ్వుమంది అన్నపూర్ణ. అతడి పట్టు నుండి విడిపించుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూ.

అదే సమయంలో ప్రదీప్ తన అల్లరి మూకతో అటుగా వస్తూ తల్లి కేక విన్నాడు. వెంటనే పరుగెత్తుకుంటూ వెళ్ళి నర్సింహులు నడుము పట్టుకున్నాడు.

నరసింహులు తన బలమైన హస్తాలతో ప్రదీప్‌ని ఒక్క తోపు త్రోసాడు.

మరుక్షణం నరసింహులు తల మీద బండరాయి పడింది.

"అమ్మా" అంటూ కుప్పకూలిపోయాడు నరసింహులు.

పిల్లలు భయపడిపోయి పరుగు లంఘించారు. ప్రదీప్ బిక్కచచ్చిపోయి తల్లి కాళ్ళను చుట్టేశాడు.

మరికాస్సేపు అక్కడే ఉంటే తన కొడుకే నరసింహుల్ని చంపి ఉంటాడని అనుమానించి పోలీసులు అరెస్టు చెయ్యవచ్చు. తొందరగా అక్కడినుండి నిష్క్రమించడం శ్రేయస్కరమని తలచింది అన్నపూర్ణ.

ఇలా అనుకుంటూ ఉండగానే పోలీసు జీపొచ్చి ఠక్కున ఆగింది.

పోలీసుల్ని చూడటంతోనే "పసి వయసులో నేరాలు చేసిన బాల నేరస్తులను ప్రభుత్వం బోస్టల్ స్కూల్లో చేర్పిస్తుంది" అన్న కమలమ్మ మాటలు చెవిలో ప్రతిధ్వనించాయి. వచ్చిన అవకాశం వదులుకోలేక, మాతృ ప్రేమను సమాధి చేయలేక ప్రతిమలా నిలబడిపోయింది అన్నపూర్ణ.

మానభంగానికి గురైపోతున్న తల్లిని కాపాడటం కోసం ప్రదీప్ నరసింహులు మీద రాయి విసిరి ఉంటాడని అనుకుని అతడిని జీపు ఎక్కించుకుని వెళ్ళిపోయారు పోలీసులు.

ఆనాటి నుండి బాల నేరస్తుడిగా బోస్టల్ స్కూల్లో చదువుకుంటున్నాడు ప్రదీప్. తను ఏ నేరం చేయకపోయినా తల్లి తనని హంతకుణ్ణి చేసి పోలీసులకు అప్పజెప్పిందన్న కోపంతో ఆమె పట్ల ద్వేషాన్ని పెంచుకోసాగాడు. తల్లి ముఖం చూడటమే మహా పాపమనుకుంటున్నాడు.

బిడ్డ తన నెందుకు ద్వేషిస్తున్నాడో అన్నపూర్ణకు తెలుసు. ప్రదీప్ బాగుపడటం కోసం తను చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో మరి గత్యంతరం లేక అలా ప్రవర్తించవలసి వచ్చింది. లోకంలో ఏ తల్లీ చేయలేని దుస్సాహసాన్ని కొడిగట్టింది. పిల్లవాడి శ్రేయస్సు తన అంతిమ ధ్యేయంగా భావించింది. ఆ పసివాడికి ఈ అమ్మ ఆవేదన ఎలా అర్థమౌతుంది? ఏది ఏమైనా తన కొడుకు ప్రయోజకుడవ్వాలి. అందరిలా సంఘంలో తలెత్తుకుని గౌరవప్రదంగా జీవించాలి. అందుకు తనెంతటి మనస్తాపాన్నైనా సంతోషంగా అనుభవించడానికి సిద్ధంగా ఉంది. ఇవాళ కాకున్నా రేపైనా నిజం తెలుసుకుని తన ఆశల దీపం తప్పకుండా తన ఇంట్లో అడుగు పెట్టి తన చీకటి గుండెలో వెలుగులు నింపుతాడని ఆమె మూగ మనసు ఘోషించసాగింది.

● *ఆంధ్రప్రభ వీక్లీ, 1–5–91* ●